# అర్హులైన ప్రతి రైతుకు పట్టాలు
# అందించేందుకు కృషి చేస్తాం

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

అక్షిత ప్రతినిధి భూపాలపల్లి: రైతులు భూముల సర్వే, పట్టాల జారీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు..
శనివారం భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండలం బుద్ధారం గ్రామంలో , భూపాలపల్లి రూరల్ మండలం కమలాపూర్ గ్రామంలో తెలంగాణ భూ సర్వే సరిహద్దుల నిర్ధారణ పై నిర్వహించిన గ్రామ సభలలో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే ..మిగతా 2లో







www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

ఆదివారం | 28 | జూన్ | 2026 | పేజీలు: 08




# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను
# వేగవంతం చేయాలి

**ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి**

**ప్రత్యేక అధికారులు గుడిసెలలో నివాసం ఉండే వారిని గుర్తించి నివేదిక అందించాలి**

**నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు**

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ అక్షిత బ్యూరో:** నిరుపేదలకు నీడ కల్పించాలన్నా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా క్షేత్రస్థాయిలో పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాకు మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఆయా మండలాల వారీగా సమీక్షిస్తూ, అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాకు మంజూరైన (8953) ఇళ్లకు గాను 81. శాతంతో (7271) ఇళ్లకు గ్రౌండింగ్ పూర్తి అయిందని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో ప్రతి రోజూ పర్యటించి, నిర్మాణాలు వేగవంతం అయ్యేలా తగు చర్యలు ..మిగతా 2లో

## జిల్లావ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని
# విజయవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్**



**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** జిల్లాలోని పిల్లల భవిష్యత్తును పోలియో మహమ్మారి బారి నుండి రక్షించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జూన్ 28 ఆదివారం నాడు జిల్లావ్యాప్తంగా 'పల్స్ పోలియో' చుక్కల కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు ..మిగతా 2లో

## పెండ్లిళ్లు, శుభకార్యాల్లో మిగిలిన ఆహారాన్ని
## నాణ్యత పరిశీలించిన తర్వాతే
# స్వీకరించాలి

**జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి:** జిల్లాలో పెండ్లిళ్లు, శుభకార్యాలు, విందు కార్యక్రమాలు, సామూహిక భోజనాల అనంతరం మిగిలిపోయిన ఆహారాన్ని స్వీకరించే ముందు దాని నాణ్యత, తాజాదనం, పరిశుభ్రతను తప్పనిసరిగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రజలకు సూచించారు. ఇటీవల రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మిగిలిన ఆహారం తీసుకోవడం వల్ల ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. పెళ్లిళ్లు, వేడుకలు, ఇతర కార్యక్రమాల అనంతరం మిగిలిన ఆహారాన్ని కొందరు ..మిగతా 2లో

## ఎస్ఐఆర్-2026 విజయవంతానికి
# ప్రజల సహకారం కీలకం

**ప్రతి ఇంటికి ఎన్యూమరేషన్ ఫారమ్ అందజేసి వివరాల సేకరణ**

**303 మంది బీఎల్ఓలు, 30 మంది సూపర్వైజర్లతో క్షేత్రస్థాయిలో ప్రక్రియ**

**డూప్లికేట్ నమోదుల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణపై దృష్టి**



**ములుగు, అక్షిత ప్రతినిధి:** భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్--2026) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇంటింటికీ వచ్చే బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓలు) ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ ..మిగతా 2లో

## జిల్లావ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**మొదటి పేజీ తరువాయి...**

స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు, సేవా సంస్థలు అవసరమైన వారికి పంపిణీ చేస్తున్న నేపథ్యంలో, ఆహారం సురక్షితంగా ఉందో లేదో నిర్ధారించుకోవడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. ఆహారం తయారైన సమయం, నిల్వ చేసిన విధానం, పరిశుభ్రత ప్రమాణాలు, రవాణా పరిస్థితులు వంటి అంశాలను పరిశీలించిన తర్వాత మాత్రమే పంపిణీ చేసి వినియోగించాలని సూచించారు. ఎక్కువసేపు గది ఉష్ణోగ్రత వద్ద నిల్వ ఉంచిన ఆహారం త్వరగా కలుషితమై ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఇలాంటి ఆహారం విషయంలో మరింత జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సేవా కార్యక్రమాల పేరుతో పంపిణీ చేసే ఆహారం తప్పనిసరిగా పరిశుభ్రమైన పాత్రల్లో నిల్వ చేసి, సురక్షితమైన పరిస్థితుల్లో తరలించాలని, ఆహార భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా వ్యవహరించాలని నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు. ఆహారం వాసన, రంగు, రుచి లేదా నాణ్యతలో ఏవైనా మార్పులు కనిపిస్తే వెంటనే దానిని వినియోగించకుండా పారవేయాలని చెప్పారు. ఆహారం తీసుకున్న తర్వాత వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, జ్వరం, వికారం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ప్రజల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని పేర్కొన్న జిల్లా కలెక్టర్, ప్రతి ఒక్కరూ ఆహార భద్రతా నిబంధనలు పాటించి సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్నే వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే శు భకార్యాల నిర్వాహకులు, క్యాటరింగ్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ఆహార పంపిణీలో పూర్తి బాధ్యతతో వ్యవహరించి ఆహార వ్యర్థాలను తగ్గించడంతో పాటు ప్రజల ఆరోగ్య రక్షణకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

## ఎస్ఐఆర్-2026 విజయవంతానికి ప్రజల సహకారం కీలకం

**మొదటి పేజీ తరువాయి...**



సహదేవరావు కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితాను మరింత ఖచ్చితత్వంతో, పారదర్శకంగా రూపొందించే లక్ష్యంతో ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో బీఎల్ఓలు ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటర్ల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.

**ప్రతి కుటుంబం బాధ్యతగా సహకరించాలి : జిల్లా కలెక్టర్**

ప్రతి కుటుంబానికి ఎన్యూమరేషన్ ఫారమ్ అందజేస్తున్నామని, కుటుంబ సభ్యుల పేరు, వయస్సు, చిరునామా, ఓటరు నమోదు సంబంధిత వివరాలను సరిచూసి సరైన సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదై ఉంటే తొలగించడం, మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం, కొత్తగా అర్హత పొందిన ఓటర్లను నమోదు చేయడం, తప్పులున్న వివరాలను సవరించడం ఈ కార్యక్రమంలోని ప్రధాన అంశాలని తెలిపారు. 303 మంది బీఎల్ఓలు, 30 మంది సూపర్వైజర్లతో క్షేత్రస్థాయిలో ప్రక్రియ జిల్లాలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు 303 మంది బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ తిరుగుతూ సమాచారం సేకరిస్తున్నారని తెలిపారు. వారి పనిని పర్యవేక్షించేందుకు 30 మంది సూపర్వైజర్లు, కార్యక్రమ నిర్వహణ కోసం 9 మంది సహాయ ఎన్నికల నమోదు అధికారులు, మొత్తం ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఒక ఎన్నికల నమోదు అధికారి ప్రత్యేక బాధ్యతలు నిర్వర్తిస్తున్నట్లు వివరించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఎన్నికల సిబ్బందికి ప్రజలు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా పూర్తి వివరాలు అందించి సహకరించాలని కలెక్టర్ కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను

# వేగవంతం చేయాలి

**మొదటి పేజీ తరువాయి...**



తీసుకోవాలన్నారు. ప్రతి వారం స్టేజీలవారీగా ఇళ్లను తుది దశకు పురోగతిలోకి తీసుకురావాలన్నారు. ఇసుక, గ్రావెల్ విషయంలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ అధికారులను ఆదేశించారు

ఇప్పటికీ ప్రారంభించని ఇండ్లను వెంటనే ప్రారంభించి జూలై 15 వరకు పూర్తి చేయాలన్నారు ప్రతి రోజూ ఎన్ని ఇళ్లు పూర్తి అవుతున్నాయన్న అంశం మీద సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. దారిద్య రేఖకు దిగువన ఉండి ఇండ్లు నిర్మించుకోలేని నిరుపేదలు మహిళా స్వయం సహాయక సభ్యులుగా ఉన్నట్లయితే డి ఆర్ డి ఓ ఆధ్వర్యంలో రుణాలు మంజూరు చేసి ఇండ్లు నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డి ఆర్ డి ఓ ను ఆదేశించారు.రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఇప్పుడు గుడిసెలో నివసించే వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ముందుకు పోతున్నామన్నారు. రాష్ట్రాన్ని గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వ ఆదేశాలతో అన్ని గ్రామాలు, నగర జనాభా ప్రాతిపదికన ఇళ్లు కేటాయించి లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు

ఇందుకుగాను ప్రత్యేక అధికారులు జిల్లాలోని ఆయా మండలాల్లో గుడిసెల్లో నివసించే వారిని త్వరితగతిన గుర్తించి నివేదికలు అందజేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాలోని అన్ని నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ మాణిక్యం, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఏ పి డి శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్స్ డిఈలు, ఏఈలు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి రైతుకు పట్టాలు అందించేందుకు కృషి చేస్తాం

**మొదటి పేజీ తరువాయి...**

మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు భూముల సర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా నిర్వహిస్తూ,అర్హులైన ప్రతి రైతుకు పట్టాలు అందించేందుకు చర్యలుతీసుకుంటున్నామని, నియోజకవర్గంలో సుమారు 50 వేల మంది పట్టాదారులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించిందన్నారు.భూపాలపల్లి నియోజక వర్గంలో తదితర గ్రామాల్లో వేల ఎకరాల భూములకు సంబంధించి పట్టాల సమస్యలు ఉన్నాయని,వాటి పరిష్కారానికి సర్వే ద్వారా అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు.భూమి యజమాని ప్రత్యక్షంగా హాజరు కాకపోయినా,సంబంధిత వివరాలు నమోదు చేసి సర్వే పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు.ఈ అంశంపై ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి , జిల్లా కలెక్టర్‌తో పలుమార్లు చర్చించి




ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు.

పట్టాలు లేక రైతు భరోసా,రైతు బీమా, భూముల రిజిస్ట్రేషన్ వంటి ప్రయోజనాలు పొందలేక ఇబ్బందులు పడుతున్న రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సింగరేణి,సోలార్ ప్రాజెక్టులు, పరిశ్రమల కోసం భూములు కోల్పోయిన రైతుల సమస్యలను కూడా సర్వే ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.సర్వే ప్రక్రియ ద్వారా ప్రభుత్వ భూములు, లావాణి భూములు, సీలింగ్ భూములు తదితర భూముల వివరాలు స్పష్టంగా నమోదవుతాయని,చట్టబద్ధ హక్కులు కలిగిన వారికి పూర్తి అధికారం లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. రైతులందరూ సర్వే కార్యక్రమంలో పాల్గొని తమ భూముల హక్కులను నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో ఎమ్మెల్యే వెంట ఆర్డిఓ , ఏడి ల్యాండ్ సర్వే అధికారులు,స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

## పెండ్లిళ్లు, శుభకార్యాల్లో మిగిలిన ఆహారాన్ని నాణ్యత

# పరిశీలించిన తర్వాతే స్వీకరించాలి

**మొదటి పేజీ తరువాయి...**

స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు, సేవా సంస్థలు అవసరమైన వారికి పంపిణీ చేస్తున్న నేపథ్యంలో, ఆహారం సురక్షితంగా ఉందో లేదో నిర్ధారించుకోవడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. ఆహారం తయారైన సమయం, నిల్వ చేసిన విధానం, పరిశుభ్రత ప్రమాణాలు, రవాణా పరిస్థితులు వంటి అంశాలను పరిశీలించిన తర్వాత మాత్రమే పంపిణీ చేసి వినియోగించాలని సూచించారు. ఎక్కువసేపు గది ఉష్ణోగ్రత వద్ద నిల్వ ఉంచిన ఆహారం త్వరగా కలుషితమై ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఇలాంటి ఆహారం విషయంలో మరింత జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

సేవా కార్యక్రమాల పేరుతో పంపిణీ చేసే



ఆహారం తప్పనిసరిగా పరిశుభ్రమైన పాత్రల్లో నిల్వ చేసి, సురక్షితమైన పరిస్థితుల్లో తరలించాలని, ఆహార భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా వ్యవహరించాలని నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు. ఆహారం వాసన, రంగు, రుచి లేదా నాణ్యతలో ఏవైనా మార్పులు కనిపిస్తే వెంటనే దానిని వినియోగించకుండా పారవేయాలని చెప్పారు.

ఆహారం తీసుకున్న తర్వాత వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, జ్వరం, వికారం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

ప్రజల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని పేర్కొన్న జిల్లా కలెక్టర్, ప్రతి ఒక్కరూ ఆహార భద్రతా నిబంధనలు పాటించి సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్నే వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే శుభకార్యాల నిర్వాహకులు, క్యాటరింగ్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ఆహార పంపిణీలో పూర్తి బాధ్యతతో వ్యవహరించి ఆహార వ్యర్థాలను తగ్గించడంతో పాటు ప్రజల ఆరోగ్య రక్షణకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY



## గద్వాల జిల్లాలో 64 అంగన్వాడీ టీచర్ ,09 అంగన్వాడీ ఆయాలు

# పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**మొత్తం 73 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం.**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**



గద్వాల అక్షిత న్యూస్ జూన్ 29.226 నుండి జూలై 08.2026 వరకు అంగన్వాడీటీచర్,ఆయా పోస్టులకు దరఖాస్తులస్వీకరణ ...జోగులాంబ గద్వాల జిల్లాలోని (3) ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాల పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్లు,గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఐసీడీఎస్ గద్వాల్ అర్బన్ ప్రాజెక్టులో 28 అంగన్వాడీ టీచర్ పోస్టులు,5 గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టులు కలిపి మొత్తం 33 పోస్టులు,ఐసీడీఎస్ మల్దకల్ ప్రాజెక్టులో 22 అంగన్వాడీ టీచర్ పోస్టులు,4 గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టులు కలిపి మొత్తం 26 పోస్టులు,ఐసీడీఎస్ మానవపాడు ప్రాజెక్టు పరిధిలో 14 అంగన్వాడీ టీచర్ పోస్టులు ఉన్నాయి.ఈ మూడు ప్రాజెక్టులలో కలిపి మొత్తం 64 అంగన్వాడీ టీచర్ పోస్టులు,9 గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టులు, మొత్తం 73 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.అర్హులైన మహిళా అభ్యర్థులు జూన్ 29.2026 నుంచి జూలై 08.2026 సాయంత్రం 5.00 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

అర్హతలు,నిబంధనలు,పోస్టుల వివరాలు మరియు దరఖాస్తు విధానం కోసం మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిక వెబ్‌సైట్ అయినను సందర్శించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఆన్లైన్ లో సమర్పించిన దరఖాస్తులు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు.అవసరమైతే ఈ నియామక ప్రక్రియను ఏ దశలోనైనా రద్దు చేసే అధికారం జిల్లా కలెక్టర్ కు ఉంటుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై నిజామాబాద్ పోలీసుల ఉక్కుపాదం

నిజామాబాదు, అక్షిత ప్రతినిధి:
నిజామాబాద్ జిల్లాలో రెండు వారాల్లో 426 కేసులు నమోదు.. రూ.41.60 లక్షల జరిమానా, 10 మందికి జైలు శిక్ష, నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు కఠిన చర్యలు కొనసాగి స్తున్నారు. గత రెండు వారాల్లో నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 426 మంది పట్టుబడగా, వారిని నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ కోర్టుల్లో హాజరుపరిచినట్లు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ తెలిపారు.ఈ కేసుల్లో 10 మందికి వారం రోజుల జైలు శిక్ష విధించగా, మిగిలిన వారికి సంబంధిత కోర్టులు కలిపి రూ.41 .60 లక్షల జరిమానా విధించాయి.జూన్ 15 నుంచి జూన్ 27 వరకు కమిషనరేట్ పరిధిలోని నిజామా బాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో అన్ని లా అండ్




ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ప్రజలకు పలు సూచనలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, వాహన పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారి డ్రైవింగ్ లైసెన్స్ ఆరు నెలల పాటు సస్పెండ్ అవుతుందని తెలిపారు. మద్యం మత్తులో ప్రమాదం జరిగితే బీమా ప్రయోజనాలు లభించవని హెచ్చరించారు. అలాగే మైనర్లు మద్యం సేవించి వాహనం నడిపితే, మైనం "తో పాటు వాహన యజమానిపై కూడా కేసులు నమోదు చేసి జైలు శిక్షకు గురిచేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పదేపదే పట్టుబడితే మరింత కఠిన చర్యలు తీసుకుం టామని, మోటారు వాహనాల చట్టం--1988 (2019 సవరణ) ప్రకారం భారీ జరిమానాలు, జైలు శిక్షలు అమలులో ఉన్నాయని హెచ్చరించారు.

# వర్షాలు కురవాలని గ్రామదేవతలకు జలాభిషేకాలు

రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్న బోనాల గ్రామంలో వర్షాలు కురవాలని గ్రామదేవతలకు జలా భిషేకాలు నిర్వహించారు.చిన్న బోనాల గ్రామం లో వర్షాలు సమృద్ధిగా కురవాలని గ్రామస్తులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు కలిసి పోచమ్మ తల్లి పెద్దమ్మ తల్లి ఎల్లమ్మ శ్రీకృష్ణ ఆలయం మరియు మల్లికార్జున స్వామి ఆలయం ఆంజనేయ స్వామి ఆలయాల్లో పలు గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. గ్రామ శ్రేయస్సు,పాడి పంటలసిరి సంపద, ప్రజల సుఖశాంతి కోసం ప్రత్యేక పూజలు చేపట్టారు. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ కార్యక్రమంలో భక్తి భావంతో గ్రామస్థులు పెద్ద



సంఖ్యలో పాల్గొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామం సుభిక్షంగా ఉండాలని గ్రామదేవతలను ప్రార్థించారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు మహిళలు అందరు పాల్గొన్నారు





## జూన్ 28న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చెయండి

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వెయిట్ జిల్లా కేంద్రంలో పల్స్ పోలియో పై అవగాహన ర్యాలీ**



వనపర్తి అక్షిత ప్రతినిధి : అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లాలో జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన అవగాహన ర్యాలీని శనివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పల్స్ పోలియో వ్యాధి దేశంలో చాలా సంవత్సరాల క్రితమే నిర్మూలన అయినప్పటికీ, పొరుగు దేశాల నుంచి వచ్చే వలసదారుల కారణంగా మళ్లీ వ్యాప్తి చెందే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, దీనివల్ల ఎలాంటి హాని ఉండదని తెలిపారు. జిల్లాలో గుర్తించిన 46,150 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 343 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి, దాదాపు 1,300 మంది వైద్య, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచి నట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని, అలాగే ప్రజలు, ప్రజాప్రతినిధులు, పత్రికా మిత్రులు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్ , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు, నర్సింగ్ విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## కార్తికేయ తేజ్‌ని ఆశీర్వదించిన మాజీ జెడ్పిటిసి విజితా రెడ్డి



కల్వకుర్తి అక్షిత ప్రతినిధి రాఘయిపల్లి గేట్ సమీపంలోని బిబిఆర్ ఫంక్షన్ హాల్లో తెలంగాణ ఉద్యమకారుడు,సింగర్ (టీచర్) సామ చెన్నకేశవులు కుమారుడు కార్తికేయతేజ్ తొలి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు మాజీ జెడ్పిటిసి,కల్వకుర్తి మార్కెట్ చైర్మన్,తెలంగాణ ఉద్యమ కారిణి డా.ధ్యాప విజిత రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ఆయురా రోగ్యాలతో విద్యా-విజయాలతో,సుఖసంతోషాలతో నిండి చిరంజీవిగా ఎదగాలని ఆకాంక్షించారు.చిన్నారి కార్తికేయతేజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక
ఆదివారం | 28| జూన్ | 2026

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఆర్యవైశ్య సంఘ నాయకులు 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రామన్న



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి** అమనగల్ మున్సిపాలిటీ గుర్రం గుట్ట కాలనీకి చెందిన. నూతన గంటి రాములు-జయమ్మ రెండో కుమారుడు అయిన."ఛి.వెంకటేష్ పరిమళ, విందు. కార్యక్రమ వేడుకకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన.ప్రముఖ సంఘ సేవకులు మరియు 5 వ వార్డు కౌన్సిలర్ పాపి శెట్టి రామన్న నూతన దంపతులపై అక్షింతలు వేసి ఆయురారో గ్యాలతో అష్టైశ్వర్యాలతో మీ పచ్చని పండంటి కాపురం చల్లగా వర్ధిల్లాలని తన యొక్క ఆశీర్వాదాన్ని అందజేశారు.. మరియు వారితో పాటు ఈ..వేడుకల్లో పాల్గొన్న.రామన్న మిత్రమండలి సభ్యులు.భాస్కర్ శ్రీను నాయక్ ముసల కమిటీ కుల పెద్దలు. నరసింహ చిన్న నారాయణ వెంకటేష్ బాలయ్య మోహన్ నరేందర్ లక్ష్మణ్ రాము పరమేష్ మల్లేష్ మోహన్ సైజులు శ్రీను రాములు వెంకటేష్ తదితరులు.బంధుమిత్రులు పాల్గొన్ని నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది

## తిమ్మాపూర్ సర్కిల్ కార్యాలయంలో వార్షిక తనిఖీలు.



**కరీంనగర్ అక్షిత బ్యూరో** పోలీస్ శాఖలో పరిపాలనా దక్షత, పారదర్శకతను పెంపొందించే భాగంలో భాగంగా శనివారం తిమ్మాపూర్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో వార్షిక తనిఖీలను సీపీ గౌష్ ఆలం నిర్వహించారు. ఈ సమగ్ర సమీక్షలో కార్యాలయ రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, ప్రజల ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియల సామర్థ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు.తనిఖీల్లో భాగంగా కార్యాలయ ప్రాంగణంలోని అంతర్గత, బాహ్య పరిసరాల పరిశుభ్రతను సీపీ నిశితంగా పరిశీలించారు. కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పరిధిలోని స్టేషన్ రికార్డులు, పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు మరియు వాటి దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా సమీక్షించారు. తిమ్మాపూర్ సర్కిల్ పరిధిలోకి వచ్చే మూడు పోలీస్ స్టేషన్లయిన తిమ్మాపూర్, ఎల్.ఎమ్.డి కాలనీ, చిగురుమామిడిల పనితీరుపై సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించిన సీపీ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, మరియు స్థానిక సమస్యల పరిష్కారంపై చర్చించారు. ప్రస్తుతం సర్కిల్ పరిధిలోని అన్ని రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉందని, కేసుల దర్యాప్తు పురోగతి సంతృప్తికరంగా ఉందని సీపీ పేర్కొన్నారు. సుమారు నెల రోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించిన కొత్త సర్కిల్ ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్, అప్పుడే సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుంటుండటాన్ని ఈ సందర్భంగా అభినందించారు.మరింత సమర్థవంతమైన, ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ వ్యవస్థను అందించేందుకు రాష్ట్ర డిజిపి జారీ చేసిన ఆదేశాలను ఈ తనిఖీల్లో భాగంగా చర్చించామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తూ, గ్రామాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు సీపీ జారీచేశారు. మొత్తంగా తిమ్మాపూర్ సర్కిల్ కార్యాలయ పనితీరు మరియు సన్నద్ధత ప్రశంసనీయంగా ఉందని సీపీ సంతృప్తి వ్యక్తం చేస్తూ స్థానిక అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్, ఎస్సైలు అన్వర్, గన్నేరువరం ఎస్సై నరేందర్ రెడ్డి ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## బీఎల్వోలతో సమన్వయంగా

# ఓటర్ మ్యాపింగ్ చేపట్టాలి

**ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్**



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** బూత్ లెవల్ అధికారులతో సమన్వయంగా పనిచేస్తూ ఓటర్ మ్యాపింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ పార్టీ శ్రేణులకు సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా శనివారం 58వ డివిజన్ ఎస్జీవోస్ కాలనీ పరిధిలోని 200వ పోలింగ్ బూత్‌ను



ఆయన సందర్శించారు. బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌ఓ) మంజులతో కలిసి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, ఇతర సవరణలు సకాలంలో పూర్తయ్యేలా బీఎల్వోలతో సమన్వయంగా పనిచేయాలని సూచించారు. ఓటర్ల జాబితా ఖచ్చితత్వం పెంపొందించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

ప్రతి బూత్‌లో పార్టీ బలోపేతానికి ఓటర్ మ్యాపింగ్ కీలకమని పేర్కొన్న ఆయన, ప్రతి ఓటరుతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో 58వ డివిజన్ బీఆర్ఎస్ స్థానిక నాయకులు ఇమ్మడి రాజు, నర్సింహారావు, స్నేహిత్, రమేష్, ఆమెర్ తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ కుషల్ మహోత్సవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు.






**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్‌లోని కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) లో కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వరంగల్ కుషల్ మహోత్సవ్ -- కుషల్ భారత్, వికసిత్ భారత్ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, తెలంగాణలో హైదరాబాద్ తర్వాత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం వరంగల్ అని పేర్కొన్నారు. ఇప్పటికే వరంగల్ విద్యా కేంద్రంగా ఎదిగిందని, రానున్న రోజుల్లో హెల్త్ హబ్, స్పోర్ట్స్ హబ్‌గా కూడా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు.

మామునూరు విమానాశ్రయం, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల ద్వారా వరంగల్ ప్రాంతంలో పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఏర్పడనున్నాయని తెలిపారు. స్థానిక యువత ఆ అవకాశాలను అందిపుచ్చుకునేలా అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఉద్యోగాలకు అవసరమైన ప్రావీణ్యం, శిక్షణను అందించడంలో ఇలాంటి కుషల్ మహోత్సవ్ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ, మాజీ మీజ కపిలవాయి దిలీప్,మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే, కిట్స్ కళాశాల చైర్మన్ ఓడితల సతీష్ కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

## రామప్రభు ఆధ్వర్యంలో 9వ శనివారం మహా అన్నదానం, ఉచిత మెగా మెడికల్ క్యాంప్..

**రామప్రభు సామాజిక సేవలకు ప్రజలనుండి విశేష స్పందన , అభినందనలు..**





**మియాపూర్ అక్షిత ప్రతినిధి..** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో 9వ శనివారం మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. అదే సందర్భంగా సంయుక్తంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో మియాపూర్ ఎఫ్ సి ఐ కాలనీలో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ హెల్త్ చెకప్ క్యాంప్ కూడా విజయవంతంగా నిర్వహించడం జరిగింది."అన్నదానం మహాదానం -- ఆరోగ్యమే మహాభాగ్యం" అనే లక్ష్యంతో నిర్వహించిన ఈ రెండు సేవా కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ, స్పందన లభించింది. మహా అన్నదానంలో వందలాది మంది నిరుపేదలు, కార్మికులు, వృద్ధులు, మహిళలు, స్థానిక ప్రజలు అన్నప్రసాదం స్వీకరించగా, ఉచిత మెడికల్ క్యాంప్‌లో వందలాది మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకుని నిపుణులైన వైద్యుల సలహాలు పొందారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా అట్టేపల్లి రామప్రభు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం, ప్రజల సంక్షేమం మరియు సమాజ సేవే తన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పాండు,రవి, శ్రీరాములు, సోమేశ్వర్, దయాకర్,వేణు,సాయి, శ్రీనివాస్ శ్రీరామ్,తేజ, రాంచరణ్ ఏఆర్పీ టీమ్ సభ్యులు, ట్రస్ట్ సభ్యులు, వైద్య బృందం, సామాజిక కార్యకర్తలు, యువ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# ఉచిత మెగా మెడికల్ క్యాంప్..

**ప్రజా షెల్టర్స్, మియాపూర్‌లో 400 మందికి పైగా ఉచిత వైద్య సేవలు మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్ సౌజన్యంతో**






**మియాపూర్ అక్షిత ప్రతినిధి** సమాజ సేవే లక్ష్యంగా నిరంతరం ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, ప్రజా షెల్టర్స్ కమిటీ హాల్, మియాపూర్ మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్ సహకారంతో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ , చైర్మన్, మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ యలమంచి ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ వి. జగదీశ్వర్ గౌడ్ మరియు వారి తనయుడు వైభవ్ కృష్ణ లు పాల్గొన్నారు. సామాజిక సేవ పట్ల అంకితభావంతో ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే సంకల్పంతో పనిచేస్తున్న యలమంచి ఉదయ్ కిరణ్, మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ విశేష సేవలందిస్తున్నారు. తన సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల మన్ననలు పొందడమే కాకుండా, పలు ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డులు అందుకుని తెలంగాణకు, మియాపూర్‌కు గర్వకారణంగా నిలిచారు. యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్య, ఆరోగ్యం, యువజన అభివృద్ధి, సామాజిక సంక్షేమం వంటి అనేక రంగాల్లో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, జ్యామింత్రి బాక్సుల పంపిణీ, వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు, ఉచిత తాగునీటి పంపిణీ, వృద్ధాశ్రమాల్లో పండ్ల పంపిణీ, ఉచిత మెగా మెడికల్ క్యాంపులు, వైద్య పరీక్షలు, మందుల పంపిణీ, అనాథాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలు, క్రీడా రంగం అభివృద్ధి,వికలాంగులకు అవసరమైన సామగ్రి, విద్యా సహాయం, యువతకు క్రీడా సామగ్రి, అవార్డుల పంపిణీ, వాలీబాల్, కేరమ్ బోర్డుల పంపిణీ, ఉచిత కంటి పరీక్షల శిబిరాలు, పేద విద్యార్థులకు ఫీజు సహాయం, మహిళా దినోత్సవ వేడుకలు, గ్రేస్ అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమాలు, జీహెచ్‌ఎంసీ కార్మికులకు ఫుడ్ డ్రైవ్, సమ్మర్ కూలింగ్ స్టేషన్ల ఏర్పాటు, అలాగే అనుబంధ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ వంటి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ సమాజంలో విశేష గుర్తింపు పొందుతోంది.

ఈ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు మియాపూర్‌కే పరిమితం కాకుండా తెలంగాణ వ్యాప్తంగా ప్రజల ప్రశంసలు అందుకుంటూ, సామాజిక బాధ్యత, మానవతా విలువలు, ప్రజా సంక్షేమానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి.

ఈ సందర్భంగా ముఖ్య అతిథి వి. జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం గొప్ప సేవా కార్యక్రమమని, యలమంచి ఉదయ్ కిరణ్ సామాజిక సేవలో ముందుండటం అభినందనీయమని పేర్కొన్నారు .ఉదయ్ కిరణ్ తనకి అత్యంత సన్నిహితుడు ,హృదయానికి దగ్గరైన వ్యక్తి,యువకుడు ఇలాంటి వాళ్ళు సమాజానికి ఎంతో అవసరం అని తెలిపారు. ఉదయ్ చేస్తున్న అన్ని కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తున్నాయని,చాలా మంది యువతకి ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశాసించారు ,యువ శక్తి ని ప్రోత్సహించడం మనందరికీ బాధ్యత అని,ఇలాంటి గొప్ప కార్యక్రమాలని చేపడుతున్న వ్యక్తికి అన్ని విధాల సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య సేవలకు దూరమవుతున్న పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం గొప్ప మానవతా సేవ అని కొనియాడారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స అందించేందుకు ఇలాంటి మెగా మెడికల్ క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత విస్తృతంగా ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు. అనంతరం యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ, “మియాపూర్ డివిజన్ ప్రజల ఆరోగ్యం, సంక్షేమమే మా ప్రధాన లక్ష్యం. ఈ మెగా మెడికల్ క్యాంప్ ద్వారా వందలాది మందికి అవసరమైన వైద్య సేవలు అందించగలిగినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తాము. మా సేవా కార్యక్రమాలకు సహకరిస్తూ, ప్రోత్సహిస్తున్న ముఖ్య అతిథులు, వైద్యులు, వాలంటీర్లు, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు మరియు ప్రతి ఒక్కరికీ మా ట్రస్ట్ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు” అని తెలిపారు.

అలాగే మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్ యాజమాన్యానికి ఉచిత వైద్య సేవలు, ఉచిత రవాణా సౌకర్యం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ప్రజా షెల్టర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శంకర్, రెడ్డమ్మ, గోపాలకృష్ణ, శ్రీను, శ్రీనివాస్,సుబ్బరాయుడు,విజయ్ ,వెంకట్ మరియు రామకృష్ణ లకి తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మెగా మెడికల్ క్యాంపులో సుమారు 400 మందికి పైగా ప్రజలు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేయించుకుని, నిపుణులైన వైద్యుల సలహాలు, అవసరమైన మందులు మరియు ఆరోగ్య మార్గదర్శకాలను ఉచితంగా పొందారు. ఈ కార్యక్రమంలో వీరమల్ల వీరేందర్ గౌడ్,నడిమింటి కృష్ణ,పట్వారీ శశిధర్ , రావిపాటి వెంకటేశ్వర్లు, ,గోవర్ధన్, డి. సాంబశివరావు,రాజు, రాజన్,శ్రీహరి,మూర్తి,భరత్, బాబ్జీ,సత్యనారాయణ, సత్య రెడ్డి,పద్మిని,శ్రీకాంత్,శరత్,నాని ,సాంబయ్య, అశోక్,మధు,ఉదయ్,శ్రీరామ్,కార్తీక్,విజయభాస్కర్, నరేందర్ రెడ్డి, పద్మ, సాయి కృష్ణ, మోహన్ రెడ్డి, ఎంసీ రెడ్డి, కృష్ణ, షా, కేవీ రావు, శేఖర్, నవ్యశ్రీ, శ్రీనివాసులు, సత్యనారాయణ, రాజేష్, కార్తీక్, దినేష్, గిరి, సీహెచ్ సాంబయ్య, బాలమురళి, నవీన్, సాధన, తాండ్ర రామచంద్ర గౌడ్, వెంకటేష్, శివ ముదిరాజ్, ప్రవీణ్, నాగసాయి, వినోద్, వంశీ చౌదరి, వాసు కామినేని, సాయి నిఖిల్, రత్నచారి, మధు, శరత్, రాధాకృష్ణ, శివప్రసాద్, సర్దార్, కర్రి నాని, అశోక్, ఇరాన్ జగన్ రామస్వామి, కిరణ్, బండి రామకృష్ణ, సురేష్, సంజయ్, ధనరాజ్, ప్రశాంత్, సల్మాన్, ఆసిఫ్, కరీం, మణిక్, శేఖర్, ప్రసాద్, రఘు, వలభనేని నరసింహరావు, ప్రకాష్, సత్య, శేషగిరిరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# ముదిగొండ గ్రంథాలయానికి మహర్దశ

**గ్రంథాలయ స్థలాన్ని సందర్శించిన చైర్మన్ ఖాదర్ బాబా**

**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఖమ్మం జిల్లా ముదిగొండ మండల కేంద్రంలో గ్రంథాలయానికి మహర్దశ పట్టుకుంది. తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరావు సహకారంతో పాత గ్రంథాలయ స్థానంలో నూతన గ్రంథాలయం నిర్మాణానికి నిధులు మంజూరైయినాయి. ప్రభుత్వం నుంచి రెండు కుంటల స్థలం గ్రంథాలయానికి అందించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి



ఖాదర్ బాబా ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో నూతన

గ్రంథాలయం రూపొందించుకుంటుంది. ఖమ్మం జిల్లాలో పలు గ్రంథాలయాల ను సందర్శించి గ్రంథాలయాల అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో గ్రంథాలయాలు అభివృద్ధి జరగనున్నది. ఈ సందర్భంగా ముదిగొండ గ్రంథాలయానికి కేటాయించిన స్థలాన్ని నిన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్ బాబా శనివారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు జే భాస్కరరావు సుమలత శ్రీనివాసరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించిన నిర్మల్ జిల్లా షీ టీమ్

**జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్**



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ పనితీరు కనబరిచి మొదటి స్థానం సాధించిన నిర్మల్ జిల్లా షీ టీమ్ సభ్యులను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ శనివారం జిల్లా భరోసా కేంద్రాన్ని సందర్శించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మహిళలు, బాలికల భద్రతకు షీ టీమ్ అధికారులు, సిబ్బంది అంకిత భావంతో పనిచేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించడం, ఫిర్యాదులపై తక్షణ స్పందనతో సమర్థవంతంగా విధులు నిర్వహించడం వల్లే రాష్ట్ర స్థాయిలో ఈ ఘనత సాధించారని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా మరింత సమర్థవంతంగా పనిచేసి జిల్లా పోలీసులకు మరిన్ని విజయాలు తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించడం జిల్లా పోలీసు శాఖకు గర్వకారణమని పేర్కొంటూ, షీ టీమ్ ఇన్‌చార్జ్ ఎస్ఐ ఎం. నర్సయ్యతో పాటు షీ టీమ్ సభ్యుల సేవలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలు నిరుపేద దళిత నిరుద్యోగులకు కేటాయించాలని బిఎస్పి డిమాండ్




**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి** ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో నిర్మించిన షాపులను నిబంధనలకు విరుద్ధంగా అనర్హులకు కేటాయించారని ఆరోపిస్తూ అర్హులైన దళిత నిరుద్యోగులు,గత రెండు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షా కు బహుజన్ సమాజ్ పార్టీ కల్వకుర్తి అసెంబ్లీ యూనిట్ అధ్వర్యంలో మద్దతు ఉంటుందని కల్వకుర్తి అసెంబ్లీ ఇంచార్జి ఎట్టి ఆంజనేయులు పేర్కొన్నారు అలాగే 250 మంది అప్లై చేసుకున్న వారు అందరి పేరు చిట్టి రూపం లో డ్రా తియ్యాలని డిమాండ్ చేశారు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంచందర్ మాట్లాడుతూ నిరసన కారుల ఆరోపణల ప్రకారం,స్థానిక ప్రజాప్రతి నిధులు, ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది బంధువులకు దుకాణాలు కేటాయించగా ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అర్హులైన దళిత అభ్యర్థులను పక్కన పెట్టారని తెలిపారు. రాజకీయ పలుకుబడి ఉన్నవారికి ప్రాధాన్యం ఇచ్చి కేటాయింపులు జరిపారని వారు ఆరోపించారు. అక్రమ కేటాయింపులను వెంటనే రద్దు చేసి పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులకు దుకాణాలు కేటాయించాలని బహుజన్ సమాజ్ పార్టీ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. డిమాండ్లు ఒప్పుకోకపోతే బహుజన్ సమాజ్ పార్టీ తో కలిసి అన్ని పార్టీల తో మాట్లాడి ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధితులు నిరటి మల్లష్,గోరటి వెంకన్న, కేశవులు,బిఎస్పీ జిల్లా నాయకులు కళ్యాణ్ శ్రీను కృపానందం పాల్గొన్నారు

## నిర్మల్‌లో ప్రభుత్వ సలహాదారులకు ఘన స్వాగతం



**నిర్మల్, అక్షిత ప్రతినిధి:జూన్ 27:** అదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని గంజాల్ టోల్ ప్లాజా వద్ద తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, టీఎంఆర్ఈఐఎస్ వైస్ చైర్మన్ ఫహీం ఖురేషికి ఘన స్వాగతం లభించింది.నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ పుష్పగుచ్ఛాలు అందజేసి వారిని సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారి పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షించారు

## జూన్ 28న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

### ప్రతి 0--5 సంవత్సరాల చిన్నారికి తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో చుక్కలు వేయించండి

### జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** భారత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్ 28 నుండి 30, 2026 వరకు జిల్లాలో ఇంటెన్సిఫైడ్ పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు తెలిపారు.జిల్లాలో 0 నుండి 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి రెండు చుక్కల బైవేలెంట్ ఓరల్ పోలియో వ్యాక్సిన్ అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. గతంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడం వల్ల 2011 సంవత్సరం నుండి జిల్లాలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదని ఈ విజయాన్ని కొనసాగించేందుకు ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం కోసం 950 పోలియో బూత్‌లు 30 మొబైల్ బృందాలు 30 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేయడంతో పాటు 4,375 మంది సిబ్బంది 108 మంది పర్యవేక్షకులు మరియు 120 వాహనాలు వినియోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 1,31,642 మంది 0--5 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి అవసరమైన 1,44,000 డోసులు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.జూన్ 28 (ఆదివారం) నాడు సమీపంలోని పల్స్ పోలియో బూత్‌కు ప్రతి తల్లిదండ్రులు తమ 0--5 సంవత్సరాల పిల్లలను తప్పనిసరిగా తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని ఆ రోజు బూత్‌కు రాలేని పిల్లలకు జూన్ 29 మరియు 30 తేదీలలో ఇంటింటికి వెళ్లే ఆరోగ్య సిబ్బంది ద్వారా పోలియో చుక్కలు వేయబడతాయని తెలిపారు.పిల్లలు ఇప్పటికే అన్ని టీకాలు తీసుకున్నా ఆరోగ్యంగా ఉన్నా గతంలో పల్స్ పోలియో చుక్కలు వేయించుకున్నా కూడా ఈసారి తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో మందు వేయించాలని డిఎంహెచ్ఓ డా. డి రామారావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ప్రతి చిన్నారికి రెండు చుక్కలు -- పోలియో రహిత సమాజమే మన లక్ష్యం అని పేర్కొంటూ ప్రజాప్రతినిధులు స్వచ్ఛంద సంస్థలు గ్రామ పెద్దలు ఆశా కార్యకర్తలు అంగన్‌వాడీ సిబ్బంది మరియు ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### నగరపాలక సంస్థలో బిఎల్ఓ సూపర్ వైజర్లు, ఏఈఆర్ఓలతో సమీక్ష.

### ప్రక్రియ వేగవంతంపై పలు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేసిన కమీషనర్ ప్రఫుల్ దేశాయ్.




**కరీంనగర్ అక్షిత బ్యూరో** ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేసేలా బూత్ లెవల్ సూపర్ వైజర్లు, అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారులు చర్యలు తీసుకోవాలని (ఈఆర్ఓ) నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో శనివారం బూత్ లెవల్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి పై సుదీర్ఘంగా చర్చించారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులను ఆరా తీశారు. ఎలక్టోరల్ దరఖాస్తుల పంపిణీ, ఫీల్డ్ లెవల్ సమస్యలు, ఆన్ లైన్ అప్ లోడింగ్ అప్ డేట్ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ ఏ మేరకు జరిగిందనే విషయాన్ని అడిగి తెలుసుకొని పలు సందేహాలను నివృత్తి చేశారు. ప్రక్రియ వేగవంతంపై పలు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ నగరంలో పర్యటించారు. నగర వ్యాప్తంగా బూత్ వారిగా కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ ప్రక్రియను తనిఖీ చేసి పరిశీలించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ఫీల్డ్ లెవల్ సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఎస్ఐఆర్ చేపడుతున్న విధానంపై బిఎల్ఓ అధికారులను వివరాలు అడిగి తెలుకొని పలు సూచనలతో ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్బంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా భాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. అనుమతి లేకుండా ఎలాంటి సెలవులు తీసుకోవడానికి తావులేదని స్పష్టం చేశారు. ఓటర్ సంక్షిప్త సవరణ పూర్తయ్యే వరకు బూత్ లెవల్ అధికారులను ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలన్నారు. మొదటి వారం రోజుల పాటు పోలింగ్ బూత్ ప్రకారం బిఎల్ ఓలు డోర్ టూ డోర్ తిరిగి ఒక ఓటరుకు రెండు చొప్పున ఎన్యుమరేషన్ ఫారాలను అంద జేయాలన్నారు. ఎన్నికల సంఘం ఇచ్చిన ఫార్మాట్ ప్రకారం ఓటర్ వివరాలను నమోదు చేసేలా బిఎల్ఓ లు చర్యలు తీసుకోవాలన్నారు. ఫారాలను ఫార్మాట్ ప్రకారం వివరాలను పూరించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఫీల్డ్ లెవల్ లోనే ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రకారం ఎప్పటికప్పుడు ఆన్ లైన్ ఆప్ లో వివరాలను నమోదు చేయాలన్నారు. బూత్ లెవల్ అధికారులు క్షేత్రస్థాయిలో ఓటర్ల ఇళ్లకు వెళ్లినప్పుడు ఎదురవుతున్న సాంకేతిక, ఇతర సమస్యలు ఏమున్నా గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ సమయంలోనే శాశ్వంగా వలస వెల్లిన చనిపోయిన ఓటర్లు ఉంటే ఫీల్డ్ లెవల్ లోనే విచారణ చేసి షిఫ్టెడ్, డెత్ డిక్లరేషన్ చేసి దరఖాస్తు పైన రాయాలన్నారు. అలాంటి వాటిని వెంటనే ఆప్ లో అప్ లోడ్ చేయాలని ఆదేశించారు. పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ దరఖాస్తుల్లో ఒక ఫారంను ఫొటోతో సహా బిఎల్ఓ లు సేకరించాలని ఇంకో ఫారాన్ని సంతకం చేసి ఓటర్ కు అందిచాలని సూచించారు. ఓటర్ సంక్షిప్త సవరణ ప్రక్రియలో ప్రతి బిఎల్ఓకు ఒక అదనపు సిబ్బందిని కూడ నగరపాలక సంస్థ ఉద్యోగ సిబ్బంది నుండి అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. 1500 పైగ ఓటర్లు ఉన్న బిఎల్ఓ లకు అవసరాన్ని బట్టి అదనంగా ఇద్దరు సిబ్బందిని ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాల్లో ఓటర్ వివరాలు సక్రమంగా ఉండేలా చూస్కోవడం బిఎల్ఓ, సూపర్ వైజర్ భాద్యతే అన్నారు. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ లో ఎర్రర్, అన్ కలెక్టెబుల్ వారితో పాటు ఫార్మాట్ ప్రకారం వివరాలు నింపని వారికి నోటీసులు అందించేలా సూపర్ వైజర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక ఓటర్ సంక్షిప్త సవరణ ప్రక్రియలో ఎలాంటి తప్పులు, పొరపాట్లు జరగకుండా సూపర్ వైజర్లు, మానిటరింగ్ అధికారులు జాగ్రత్త చర్యలు తీస్కోవాలన్నారు. అత్యంత పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా ప్రాధాన్యత క్రమంలో ఓటర్ సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 25 నుండి జులై 24 వరకు ఇంటింటికి వెల్లి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, జూలై 31 న ఓటర్ డ్రాఫ్టింగ్ జాబితా విడుదల, జులై 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్ ల స్వీకరిస్తామని తెలిపారు. ఆగస్టు 30 నుండి అభ్యంతరాలను పరిష్కరించి, అక్టోబర్ 1 ఓటర్ తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నిర్ధేశించిన డైట్ లైన్ ప్రకారం " సర్" ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. నగర ప్రజలు ప్రత్యేక ఓటర్ సంక్షిప్త సవరణ ప్రక్రియకు సరైన సమాచారంతో బిఎల్ఓలకు ఫారాలను అందజేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పై బిఎల్ఓ లు, సూపర్ వైజర్లు అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారులు చాలా జాగ్రత్తగా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమీషనర్లు సువార్త, ఆయాజ్, డిప్యూటీ కమీషనర్ ఖాధర్ మొహియుద్దీన్, అసిస్టెంట్ కమీషనర్ రాజ్ మనోహర్, అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంత్రి పదవికి రాజీనామా చేయాలి

### సిరిసిల్ల మానేరు బ్రిడ్జిపై యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా







**రాజన్న సిరిసిల్ల, అక్షిత** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థులకు క్షమాపణలు చెప్పి, మంత్రి పదవికి రాజీనామా చేయాలంటూ సిరిసిల్ల మానేరు బ్రిడ్జిపై యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, పెద్ద ఎత్తున బ్రిడ్జి పైకి చేరుకొని ధర్నాకు దిగడంతో, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. పెద్ద ఎత్తున వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కు మరియు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్ష పత్రాలు లీక్ కావడంపై నిరసనగా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పిలుపు మేరకు ధర్నాకు దిగినట్లు వారు తెలిపారు. ఈ కేంద్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత దాదాపుగా 89 పరీక్ష పత్రాలు లీకయ్యాయని వారు విమర్శించారు. దాదాపుగా 22 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితిలు నెలకొన్నాయంటూ వాపోయారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థి లోకానికి క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని, లేనియెడల ప్రధాని మోడీ అతన్ని మంత్రి పదవి నుండి తొలగించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడడానికి ఎంతో కష్టపడి చదివిన విద్యార్థులు ఆశలన్నీ ఆవిరయ్యాయన్ని అన్నారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు చుక్కా రాజశేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులను గుండెల్లో పెట్టి చూసుకున్నది కాంగ్రెస్ పార్టీ

**వనపర్తి డిసిసి చీఫ్, శాట్స్ చైర్మన్ శివసేన రెడ్డి**

**వనపర్తి కీ ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర రాకతో**

**సామాజిక న్యాయమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం**

**వనపర్తి ఎమ్మెల్యే మేఘరెడ్డి**

**కదం తొక్కిన గిరిజన మహిళలు**

**ఎమ్మెల్యే పిలుపుతో భారీ ఎత్తున ర్యాలీ**





**వనపర్తి అక్షిత ప్రతినిధి :** గిరిజనులను గుండెల్లో పెట్టి చూసుకున్నది కాంగ్రెస్ పార్టీ అని వనపర్తి డిసిసి చీఫ్, శాట్స్ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపుమేరకు ఈనెల 25న పిసిసి అధ్యక్షుడు బొమ్మను మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించిన ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర శనివారం వనపర్తికి చేరుకున్నది. తెలంగాణ రాష్ట్రంలో లంబాడి, ఎరుకల, యానాది, జాతులకు ఎస్టీ రిజర్వేషన్లు కల్పించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాల వేడుకల్లో భాగంగా మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను రాష్ట్రంలో సెప్టెంబర్ 18 వరకు అన్ని నియోజకవర్గాలలో యాత్ర కొనసాగుతుంది. అందులో భాగంగానే వనపర్తి చేరుకున్న ఆదివాసి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ బస్సు యాత్ర సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రం లో ఉదయం నుంచి మేఘూరెడ్డి కమ్ముకున్నాయి. వర్షాలు లేక భానుడు భగ భగ మంటున్న సందర్భంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆదివాసి రిజర్వేషన్ల ఆశీర్వాద బస్సు యాత్ర రాకతో ఒక్కసారి వాతావరణం చల్లబడి ఆకాశంలో మేఘామృతం కమ్ముకున్నది. ఈ బస్సు యాత్ర ఉమ్మడి జిల్లాలోని అచ్చంపేట నాగర్ కర్నూల్ నియోజకవర్గం నుంచి వనపర్తికి చేరుకున్నవి ఇక్కడి నుంచి దేవరకద్ర నియోజకవర్గంలో పాటు మిగతా నియోజకవర్గాలలో పర్యటిస్తూ లంబాడీలకు కల్పించిన రిజర్వేషన్లు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గిరిజన ప్రజాప్రతినిధులు ఉమ్మడి జిల్లాలోని మంత్రులు ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున కార్యకర్తలు పార్టీ శ్రేణులు పాల్గొని ఆశీర్వదించారు.

**గిరిజనులను గుండెల్లో పెట్టి చూసుకున్నది కాంగ్రెస్ పార్టీ**
**వనపర్తి డిసిసి చీఫ్, శాట్స్ చైర్మన్ శివసేన రెడ్డి**

గిరిజనుల సామాజిక, రాజకీయ సాధికారతకు పునాది వేసింది కాంగ్రెస్ పార్టీ. ఎస్టీ రిజర్వేషన్లు కల్పించి గిరిజనుల అభ్యున్నతికి మార్గం సుగమం చేసిన మహానేత ఇందిరా గాంధీ అని, అలాగే గిరిజనులను గుండెల్లో పెట్టుకొని చూసుకున్న పార్టీ కాంగ్రెస్ అన్ని శివసేన రెడ్డి అన్నారు. లంబాడి ప్రజలంతా ఒక నమ్మకంతో, ధైర్యం, బలంతో ముందుకెళ్లారని, మాట ఇస్తే మడమతిప్పరనీ శివసేన రెడ్డి అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం అని అన్నారు. రాహుల్ గాంధీ ఆకాంక్ష మేరకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కులగణన నిర్వహించి సామాజిక న్యాయానికి కొత్త దిశ చూపించబోతున్నామన్నారు.

**సామాజిక న్యాయమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం**
**వనపర్తి ఎమ్మెల్యే మేఘరెడ్డి**

అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని వనపర్తి ఎమ్మెల్యే మేఘరెడ్డి అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో రానున్న రోజుల్లో మరింత బలంగా ముందుకు సాగుతామన్నారు. సామాజిక న్యాయం సమాన అవకాశాల కల్పనకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కట్టుబడి ఉంటుందన్నారు రిజర్వేషన్ల ద్వారా వేలాది మంది విద్యా, ఉద్యోగం, రాజకీయ రంగంలో ఎదిగి సమాజంలో గౌరవప్రదమైన స్థానం గిరిజనులు సంపాదించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన నాయకులు వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టోజు బ్రహ్మాచారి, ఉమ్మడి గోపాల్పేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు సత్య శిలా రెడ్డి, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున గిరిజన మహిళలు పాల్గొని వివిధ రకాల నృత్యాలు,డాన్సులు, ప్రదర్శించారు.

# సమస్యలపై సంఘటితంగా ఉద్యమిద్దాం

**ప్రజల పక్షాన నిలబడి పోరాడే కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేద్దాం.**

**సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్.**



**కరీంనగర్ అక్షిత న్యూస్** సమాజంలో నిరంతరం ప్రజల కోసం, వారి సంక్షేమం కోసం నిలబడే కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ని బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని, సమస్యల వారిగా పోరాటాలు నిర్వహించడానికి అందరూ సంఘటితం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం గుంటూరుపల్లిలో సిపిఐ గ్రామ శాఖ ఏర్పాటు చేసిన సిపిఐ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం,వర్గ రహిత సమాజం కోసం,కార్మిక వర్గ ప్రయోజనాలే ముఖ్యమని సిపిఐ వందేళ్లుగా ప్రజల పక్షాన పోరాడుతుందని,అనేక పార్టీలు పుట్టుకొచ్చాయి, కాలగర్భంలో కలిసి పోయాయని కానీ నేటికి సజీవంగా ఉన్న పార్టీ సిపిఐ అని,సమస్య ఎక్కడ ఉంటే అక్కడ కమ్యూనిస్టులు ఉంటారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 78 ఏళ్లు గడిచినా, పాలక ప్రభుత్వాలు మారినా ప్రజల బ్రతుకులు మారడం లేదని,కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేక పోతున్నారని,నిరుద్యోగం పెరిగిపోతుందని, అవినీతి,అక్రమాలు రోజు రోజుకు పెరుగుతుందని, పేదలు మరింత పేదలుగా, ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందడం లేదని,పెట్టుబడి దారుల చేతుల్లో దేశ సంపద చిక్కుకుంటుందని అందుకు పాలక ప్రభుత్వాలే ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పులు పెరిగిపోయాయని, ప్రజలపై పన్నుల భారం విపరీతంగా పడుతుందని, కార్పోరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల బ్రతుకులు మారుతాయని అనుకుంటే గత పాలకుల మాదిరిగానే ఈ పాలకులు కూడా వ్యవహరిస్తున్నారని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో జాప్యం జరుగుతుందని, పేదల సంక్షేమం కోసం పనిచేయక పోతే రానున్న రోజుల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై సిపిఐ పోరాటాలు ఉధృతం చేయకతప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కరీంనగర్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు నలువాల సదానందం, సిపిఐ గుంటూరు పల్లి శాఖ కార్యదర్శి సాయవేణి రాయమల్లు, సీనియర్ నాయకులు సామల్లా కొమురయ్య, చిందశీ మల్లయ్య,నాయకులు తంగెళ్ళ లక్ష్మయ్య, పిల్లి రమేష్, తాత సమ్మయ్య, తంగెళ్ళ సంపత్, సదయ్య, గొడుగు సంపత్, సాయవేణి రాజు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుని కుటుంబానికి రావుల ఆర్థికసాయం



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామానికి చెందిన ఇరుపునూరి వెంకట్ కుమార్ గురువారం అర్ధరాత్రి రోడ్ ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, మాజీ పార్లమెంట్ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి 20 వేలు, సీనియర్ న్యాయవాది రావుల శంకర్ రెడ్డి 10 వేలు, మాజీ ఎంపీపీ గుంత మౌనిక 5 వేలు ఆర్థికసాయం బాధిత కుటుంబానికి స్థానిక గ్రామ నాయకుల ద్వారా పంపించారు. మృతిని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ సర్పంచ్ యాదయ్య, సర్పంచ్ భర్త సాయిలు, వైస్ ఎంపీపీ వడ్డే శ్రీనివాసులు, మాజీ సీడీసీ చైర్మన్ చెన్నకేశవ రెడ్డి, టికే కుర్మన్న, హోటల్ రాజు, గోపాల్ రెడ్డి, బాలయ్య నాయుడు, ఉప్పరి శ్రీను, రవీందర్ గౌడ్, ప్రేమదానం, బాజ గిరన్న లు కలిసి బాధితురాలికి అందజేశారు.

# ఆర్మూర్‌లో ప్రైవేట్ పాఠశాలపై తల్లిదండ్రుల ఆరోపణలు.....!

**ఎంఈఓ ని తక్షణమే సస్పెండ్ చేయాలి...!**





**ఆర్మూర్,అక్షిత ప్రతినిధి:** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రాంతంలో ఉన్న మల్లయ్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌కు చెందిన భరత్ చంద్ర పాఠశాలపై కొంతమంది తల్లిదండ్రులు తీవ్ర ఆరోపణలు చేశారు. తమ పిల్లలకు ఉర్దూ బోధించడమే కాకుండా, మతపరమైన కార్యక్రమాల్లో పాల్గొనేలా చేస్తున్నారని ఆరోపించారు. దీంతో తమ మతపరమైన మనోభావాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించగా, అదనపు భాషా పరిజ్ఞానం కల్పించే ఉద్దేశంతో ఉర్దూ బోధిస్తున్నామని యాజమాన్యం తెలిపినట్లు సమాచారం. అయితే దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన తల్లిదండ్రులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇలాంటి బోధనకు అనుమతి ఉందా అని ప్రశ్నించారు. పాఠశాల వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఘటనపై సంబంధిత అధికారులతో విచారణ జరిపించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సత్యనారాయణ తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు

**ఎంఈఓ ని తక్షణమే సస్పెండ్ చేయాలి**

ఈ ఘటన విషయం తెలుసుకున్న బీజేపీ, ఏబీవీపీ, బజరంగ్ దళ్ నాయకులు, కార్యకర్తలు పాఠశాలకు చేరుకుని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. అనంతరం ఆర్మూర్ మండల ఎంఈఓ కార్యాలయానికి వెళ్లగా, ఎంఈఓ అందుబాటులో లేరని తెలిపారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన నాయకులు, ప్రైవేట్ పాఠశాల వ్యవహారాల్లో ఎంఈఓ పాత్రపై అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇదే మండలంలో ఎంఈఓగా కొనసాగుతున్నారని, ప్రైవేట్ పాఠశాలల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, పాఠశాలల నుంచి అక్రమ వసూళ్లు జరుగుతున్నాయంటూ ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి, ఆరోపణలు నిజమైతే సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

